కనీస వసతులు కల్పించాలి

- ఏటా ప్రత్యేక వాహనాల్లో కుటుంబ సభ్యులతో వస్తున్నాం..
- మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు
- ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలి
- కాకో ఆలయం వద్ద సౌకర్యాలు మెరుగుపర్చాలి
- ప్రజాఎజెండాలో గిరిజన భక్తులు



ప్రజా ఎజెండాలో పాల్గొన్న గిరిజన భక్తులు, నాయకులు

దండేపల్లి: తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన దండేపల్లి మండలం గుడిరేవు గోదావరి ఒడ్డున వెలసిన ఆదివాసీల ఆరాధ్యదైవం శ్రీపద్మల్‌పురి కాకో ఆలయం వద్ద కనీస వసతులు కల్పించాలని, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆదివాసీ గిరిజన భక్తులు డిమాండ్ చేశారు. ఆలయ ఆవరణలో మంగళవారం 'సాక్షి' నిర్వహించిన ప్రజాఎజెండాలో పాల్గొని మాట్లాడారు. వందల కిలోమీటర్ల దూరం నుంచి కాకో ఆలయానికి ప్రత్యేక వాహనాల ద్వారా కుటుంబ సమేతంగా వస్తున్నాం. కానీ ఇక్కడ భక్తులకు సరైన సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. ఆలయానికి వచ్చే దారికూడా పాడైపోయింది. వాహనాలతో వచ్చేటప్పుడు కష్టమవుతోంది. ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ఆలయాన్ని నిర్మించడం సంతోషంగానే ఉంది. కానీ ఇక్కడకి వచ్చిన భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడం కొంత ఇబ్బందిగా ఉంది. యేటా దసరా, దీపావళి మధ్య ఆలయం వద్ద దండారి ఉత్సవాలు ఎంతో వైభవోపేతంగా నిర్వహిస్తుంటారు. ఇదే సమయంలో గుస్సాడీ దర్బార్ కూడా నిర్వహిస్తారు. దర్బార్‌కు అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారు. ఆ సమయంలో ఆలం వద్ద అవసరాలను గురించి అందరి దృష్టికి తీసుకెళ్లాం.. అయినా భక్తులకు వసతులు కల్పించడంతో విఫలమవుతున్నారు. ఇకనైనా, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు.

కనీస వసతులు కల్పించాలి..



వందల కిలోమీటర్ల దూరం నుంచి యేటా కాకో దర్శనానికి వస్తుంటాం. కానీ ఇక్కడ కనీస వసతులు లేవు. చాలా ఇబ్బంది అవుతోంది. ఒక రాత్రి నిద్దుర చేస్తాం ఆ సమయంలో కష్టంగా అనిపిస్తోంది. అమ్మవారి దర్శనం కోసం అన్నింటినీ ఓర్చుకుంటున్నాం. – సిడాం గాగ్రు, గ్రామం:కరంజి, మం: కెరమెరి

అన్నింటికీ ఇబ్బందే..



పిల్లాపాపలతో అమ్మ వారి దర్శనానికి యేటా వస్తాం. ఇక్కడ మాత్రం భక్తులకు వసతులు సక్కగ లేక ఇబ్బంది పడుతున్నాం. మరుగుదొడ్లు, మూత్రశాలలు, కరెంటు సౌకర్యం, భక్తులు బస చేసేందుకు గదులు నిర్మించాలి. – పూసం భీంరావ్, నర్సాపూర్, ఉట్నూర్ మండలం

మరుగుదొడ్లు కట్టించాలి



దండారి ఉత్సవాల్లో భాగంగా ప్రతి సంవత్సరం కాకో దర్శనానికి వస్తాం.. కానీ ఇక్కడ సౌకర్యాలు సక్కగా లేవు. మహిళలు చెప్పరాని ఇబ్బందులు పడుతున్నాం. కనీసం మహిళల కోసం మరుగుదొడ్లు, మూత్రశాలలు, స్నానపు గదులు కట్టించాలి. నీళ్ల సౌకర్యం కూడా పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలి. – రాజుబాయి, కరంజి, కెరమెరి మండలం

అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లా..



కాకో ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో కొత్త గుడి కట్టించాం..కానీ దర్శనానికి వచ్చే భక్తులకు కనీస సౌకర్యాల కోసం అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం. యేటా ఇక్కడ నిర్వహించే గుస్సాడి దర్బార్‌లో కూడా మా సమస్యలను చెబుతున్నాం.. అయినా పరిష్కారం కావడం లేదు. – సోము, ఆలయ కమిటీ చైర్మన్

క్లుప్తంగా

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న రామారావు

దండేపల్లి: తపాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తపాలశాఖ మంచిర్యాల డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామారావు అన్నారు. దండేపల్లి తపాల శాఖ కార్యాలయం ఆవరణలో మంగళవారం తపాల సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. తపాలశాఖ అందిస్తున్న పొదుపు పథకాలు, బీమాపథకాల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ తపాల ఖాతా కలిగి ఉండాలన్నారు. అనంతరం కొత్తగా 300 తపాల ఖాతాలను తెరిచారు. కార్యక్రమంలో పోస్టల్ పేమెంట్ జిల్లా ఇన్‌చార్జి వెంకటస్వామి, పోస్ట్‌మాస్టర్ గురువయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పంటల పరిశీలన


పత్తి పంటను పరిశీలిస్తున్న ఏవో

చెన్నూర్‌రూరల్: మండలంలోని లింగంపల్లి గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏవో కవిత మంగళవారం వరి, పత్తి పంటలను పరిశీలించారు. వరి పంటలో ఆకు చుట్టూ పురుగు ఎక్కువగా ఉందని, దీని నివారణకు కార్టాప్‌హైడ్రోక్లోరైడ్ ను పిచికారీ చేయాలని సూచించారు. అగ్గితెగులుకు ట్రైసైక్లోజోల్ మందును పిచికారీ చేయాలన్నారు. వరిలో సుడిదోమ నివారణకు పైమెట్రోజైన్ మందును పిచికారీ చేయాలని సూచించారు. పత్తి పంటలో తడి లేనిదే మందులు పిచికారీ చేయొద్దని, పంటకు ఆశించే గులాబీరంగు పురుగు, పొగాకు లద్దె పురుగు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఆమె వెంట ఏఈవో సాయికృష్ణ ఉన్నారు.

పశువైద్య శిబిరం


టీకా వేస్తున్న వైద్యాధికారులు

లక్సెట్టిపేట: మండలంలోని మిట్టపల్లి, వెంకట్రావ్‌పేట గ్రామాల్లో పశువులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా జిల్లా వైద్యాధికారి రమేష్ పశువులకు టీకాలు వేయించి, అవగాహన కల్పించారు. పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, దొబ్బరోగం ఎక్కువగా వ్యాప్తిస్తుందని, వాటికి సంబంధించిన వ్యాక్సిన్ అందించాలని సూచించారు. అనంతరం 1914 గొర్రెలు, 385 మేకలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్వేత, అనిల్, గోపాలమిత్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు


హెచ్‌ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ప్రధానోపాధ్యాయుడు సంజీవ్, ఉపాధ్యాయులు నాగేందర్, పద్మ, శ్రీదేవి, రజిత, మురళిలను విద్యార్థులు, ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. పాఠశాలలో బదిలీపై వెళ్తున్న వారికి తీపి గుర్తుగా జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయులు శ్రీరాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న జిజ్ఞాస నిర్వాహకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నంనూర్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించారు. జిజ్ఞాస ప్రయోగశాల ఆధ్వర్యంలో విద్యార్థులు తప్పకుండా సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచిస్తూ, పలు ప్రయోగాలను విద్యార్థుల ముందుంచారు. డీఈఓ యాదయ్య ఆదేశాల మేరకు జిల్లా సైన్స్ అధికారి మధుబాబు పర్యవేక్షణలో జిజ్ఞాస నిర్వాహకులు సాయికుమార్, సంపత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.గురువయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించారు. మానవ శరీరం, అంతర్గత అవయవాల పనితీరును ప్రయోగాత్మకంగా వివరించారు.

గుడిపేట చెక్‌పోస్ట్‌లో విస్తృత తనిఖీ


సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): శాసనసభ ఎన్నికల నేపథ్యంలో హాజీపూర్ మండలం గుడిపేటలో మంగళవారం ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. చెక్‌పోస్ట్ ప్రత్యేక అధికారులు సీడీపీఓ హేమసత్య, ఏఎస్సై రమేశ్‌తో పాటు సీఆర్‌పీఎఫ్ బలగాలు వాహనాలను నిలిపి తనిఖీలు నిర్వహించారు. మంచిర్యాల నుంచి హాజీపూర్ మండలం దాటి వెళ్తున్న వాహనాలను ఆపి మరీ, తనిఖీ చేపడుతుండగా తనిఖీ ప్రక్రియను వీడియోగా చిత్రీకరిస్తున్నారు.

దోమల మందు పిచికారీ


దోమల మందు పిచికారీ చేయిస్తున్న అధికారులు

వేమనపల్లి: మండల కేంద్రంలోని ఏహెచ్‌ఎస్ పాఠశాలతో పాటు నీల్వాయి కేజీబీవీ విద్యాలయంలో వైద్యాధికారి రాజేష్ ఆధ్వర్యంలో దోమల మందును పిచికారీ చేయించారు. దోమల నివారణ కోసం పాఠశాలలతో పాటు పరిసరాల్లో పిచికారీ చేయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. హెల్త్ అసిస్టెంట్ లింగయ్య, శన్ముకచారి తదితరులు పాల్గొన్నారు.

ఆదరించండి.. అభివృద్ధి చేస్తా

- ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్


రోడ్ షో లో పాల్గొన్న జాన్సన్‌నాయక్

జన్నారం: బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మీ ముందుకు వచ్చాను.. ఎన్నికల్లో ఆదరించి కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రేండ్లగూడ, లింగయ్యపల్లి, చింతలపల్లి, జన్నారం గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఓటును అభ్యర్థించారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్ షోలో పాల్గొని ప్రసంగించారు. జన్నారం మండలానికి డిగ్రీ కళాశాల, 30 పడకల ఆసుపత్రి, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేస్తానని, సిరిసిల్ల, సిద్ధిపేట మాదిరిగా ఖానాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుంచుతానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జన్నారం పర్యటనకు వచ్చిన జాన్సన్ నాయక్ సమక్షంలో మండలానికి చెందిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి తోట సత్యం బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనతో పాటు పలువురు టీడీపీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు పార్టీలో చేరారు. వారికి జాన్సన్ నాయక్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు గుర్రం రాజరాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి జనార్దన్, కో ఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు భరత్‌కుమార్, రాజేశ్వర్, శంకర్, శ్రీనివాస గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ మాటల యుద్ధం

- బహిరంగ చర్చకు సవాళ్లు
- సీసీసీ కార్నర్ వద్ద ఉద్రిక్తత


బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడుతున్న ఏసీపీ

నస్పూర్: ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలో పర్యటిస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకుంటున్నారు. మీ నాయకుడు అవినీతి పరుడు అంటే, మీ నాయకుడు అవినీతి పరుడు అంటూ ఇరు పార్టీల నాయకులు సందర్భం వచ్చినప్పుడల్లా విమర్శలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి సుధాకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే అండదండలతో బీఆర్ఎస్ నాయకులు భూ కబ్జాలకు పాల్పడుతున్నారని, కృష్ణాకాలనీలో జరిగిన ప్రచారంలో కౌన్సిలర్ బేర సత్యనారాయణపై వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డారు. ఎవరు అవినీతి పరులో తేల్చుకుందామని మంగళవారం సీసీసీ కార్నర్ వద్దకు రావాలని సవాల్ విసిరారు. దీనికి ప్రతిగా కౌన్సిలర్ బేర సత్యనారాయణ సైతం ప్రేంసాగర్ రావు అవినీతి పరుడు అని బండారి సుధాకర్‌పై వ్యక్తిగత దూషణలకు దిగాడు. నేను సీసీసీ కార్నర్ వద్దకు బహిరంగ చర్చకు వస్తానని, మీరు ప్రేంసాగర్‌రావుని తీసుకుని రావాలని సవాలు విసిరారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం బండారి సుధాకర్, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సురిమిల్ల వేణు ఇతర కాంగ్రెస్ నాయకులతో కలిసి సీసీసీ కార్నర్ వద్దకు వాచ్చారు. కార్యకర్తలు నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బేర సత్యనారాయణ సైతం బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులతో కలిసి సీసీసీ కార్నర్ వద్దకు చేరుకున్నారు. ఇరు పార్టీల నాయకులు ఒకరికి ఒకరు వ్యతిరేకంగా నినాదాలు చేసుకున్నారు. వారి మధ్య కాసేపు స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న ఏసీపీ తిరుపతి రెడ్డి, మంచిర్యాల రూరల్ సీఐ సంజీవ్, ఎస్సై రవికుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ఇరు పార్టీల వారిని అక్కడి నుంచి పంపించి వేశారు. దీంతో గొడవ సద్దుమణిగింది. ఇరు పార్టీల కార్యకర్తలు రోడ్డుపైకి రావడంతో కొంత సేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

ఎక్కడి సమస్యలు అక్కడే..!

- ఈసారైనా... అభివృద్ధి జరిగేనా..?
- కలగానే సెంట్రల్ లైటింగ్ సిస్టమ్, 30 పడకల ఆసుపత్రి



జన్నారం ప్రభుత్వ ఆసుపత్రి

జన్నారం: పాలకులు వస్తున్నారు.. పోతున్నారు.. ప్రభుత్వాలు మారుతున్నాయి.. కానీ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. అభివృద్ధిపై పాలకులు చిత్తశుద్ధి చూపడం లేదు. కారణంగా జన్నారం మండలంలో ఐదేళ్ల కాలంగా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేరకుండా వెక్కిరిస్తున్నాయి.

కలగానే సెంట్రల్ లైటింగ్ సిస్టం..

జన్నారం మండలం విస్తీర్ణంలో పెద్దది. మండలంలో 29 గ్రామ పంచాయతీలున్నాయి. 42వేలకు పైగా ఓటర్లున్నారు. రోజురోజుకూ మండలం అభివృద్ధి చెందుతుంది. భూముల ధరలకు రెక్కలస్తున్నాయి. పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో వ్యాపించి ఉన్న ప్రధాన రహదారి, దుకాణ సముధాయాలు, వారసంత, దినసంతల ద్వారా ప్రభుత్వానికి ఏటా ఆదాయం చేకూరుతుంది. ఐదేళ్లకోసారి వచ్చే అభ్యర్థులు హామీలు కురిపిస్తున్నా, అమలులో మాత్రం సాధ్య కావడం లేదు. జన్నారం మండలం నియోజకవర్గంలో భాగంగా ఖానాపూర్‌లో ఉన్న, మంచిర్యాల జిల్లా కిందికి వస్తుంది. రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న మండలకేంద్రంలో కనీసం సెంట్రల్ లైటింగ్ సిస్టం లేదు. గత ఎన్నికల్లో సెంట్రిల్ లైటింగ్ సిస్టం, డివైడర్లకు అభ్యర్థులు హామీ ఇచ్చినా, ఐదేళ్లు పూర్తైనా హామీలు నెరవేరలేదు. ఈసారైనా పోటీ చేసే అభ్యర్థులు హామీ ఇచ్చి నెరవేరుస్తారో.. లేదో అని మండలవాసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్ ఇప్పటికే సెంట్రల్ లైటింగ్ సిస్టం, డివైడర్లను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. మిగితా అభ్యర్థులు ప్రధాన సమస్యలపై దృష్టి పెట్టినట్లు కనిపించట్లేదు.

30 పడకల ఆసుపత్రిపై హామీ లేనట్లేనా...?

జన్నారం మండలంలో 29గ్రామ పంచాయతీలకు గాను సుమారుగా ఆరు గ్రామ పంచాయతీలు తండాలే ఉన్నాయి. ఈ 29 గ్రామ పంచాయతీలలో పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీ తప్పా, మిగితా గ్రామ పంచాయతీలలో మధ్య, పేద తరగతుల వారున్నారు. ఏదైనా అనారోగ్య సమస్య వస్తే ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉంది. ప్రభుత్వ దవాఖానలో సౌకర్యాల లేమి, సిబ్బంది కొరతతో ఆసుపత్రికి వచ్చేవారు తక్కువయ్యారు. గత ఎన్నికల్లో ప్రభుత్వ ఆసుపత్రిని 30పడకల ఆసుపత్రిగా స్థాయి పెంచుతామని అభ్యర్థులు హామీ ఇచ్చారు. కానీ ఇప్పటికి హామీ నెరవేరలేదు. సంవత్సరాలు గడుస్తున్నా సమస్యలు అలాగే కనిపిస్తున్నాయి.

నెరవేరని డిగ్రీ కళాశాల హామీ..

మండలంలో అత్యధిక మంది విద్యార్థులు డిగ్రీ చదివేందుకు మంచిర్యాల, జగిత్యాల లాంటి పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది. అత్యధిక పేద, మధ్య తరగతికి చెందిన విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో చదివినా డిగ్రీ కళాశాల లేక సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. కొందరు చదవలేక మధ్యలో మానేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ విషయంపై ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు డిగ్రీ కళాశాల ఏర్పాటుకు హామీ ఇవ్వాలి.

డిగ్రీ కళాశాల అవసరం



జన్నారం మండలంలో అత్యధికంగా పేద, మధ్య తరగతి కుటుంబాలున్నాయి. నేను వ్యవసాయం, ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నా. ప్రైవేట్ కళాశాలలో చదివించే స్థోమిత లేదు. కానీ నా పిల్లల చదువు ఎక్కడ ఆగిపోతుందో అనే భయంతో అప్పు చేసి డిగ్రీ వేరే ప్రాంతంలో చదివించాను. పాలకులు విద్యార్థుల భవిష్యత్ ఆలోచించి, మండలానికి డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి. విద్యార్థుల భవిష్యత్ గురించి హామీ ఇచ్చిన వారికే ఓటు వేస్తాం. – పాత రాజన్న, కలమడుగు

ఆసుపత్రి స్థాయి పెంచాలి



అత్యధికంగా పేద కుటుంబాలున్న జన్నారం మండలంలో ప్రభుత్వ ఆసుపత్రి ఉన్నా, వైద్య సేవలు అందడం లేదు. ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోలేని పరిస్థితిలో చాలా మంది ఉన్నారు. అనేక మందిని రెఫర్ చేస్తున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు వైద్య సేవలు అందాలంటే ఆసుపత్రిని 30 పడకల స్థాయికి పెంచి సౌకర్యాలు కల్పించాలి. వైద్య సిబ్బంది కొరత లేకుండా చూడాలి. – కోదూరి చంద్రయ్య, పొనకల్

సెంట్రల్ లైటింగ్ సిస్టం అవసరం



మండలంలోని పొనకల్ రోజురోజుకూ అభివృద్ధి చెందుతుంది. అయినా సంవత్సరాలు గడుస్తున్నా, సెంట్రల్‌లైటింగ్ సిస్టం గానీ, డివైడర్లు ఏర్పాటు చేయడంలో పాలకులు నిర్లక్ష్యం చూపుతున్నారు. గత ఎన్నికల్లో రోడ్డు డివైడర్, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా మరిచారు. – కొత్త శ్రీనివాస్, సామాజిక వేత్త, పొనకల్

ఆకట్టుకున్న కళోత్సవం పోటీలు


జన్నారం: విద్యార్థులతో ఎంఈవో విజయ్‌కుమార్


కాసిపేట: మాట్లాడుతున్న ఎంఈవో ప్రభాకర్


పెయింటింగ్‌లతో విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: జిల్లా సైన్స్ కేంద్రంలో నిర్వహించిన మండలస్థాయి కళోత్సవ్ ఆకట్టుకున్నాయి. 9 నుంచి 12 తరగతులకు చెందిన విద్యార్థులకు మంగళవారం పోటీలు నిర్వహించారు. గాత్ర సంగీతం, శాస్త్రీయ, వాయిద్య సంగీతం, శాస్త్రీయ నృత్యం, విజువల్ ఆర్ట్, దృశ్య కళ, సహజమైన బొమ్మలు, ఆటలు, నాటక ప్రదర్శన పోటీలు నిర్వహించగా ప్రతిభ కనబరిచి బాలురు, బాలికలు ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఈవో పోచయ్య, సీసీవో రాకేష్, ఎంఐఎస్ సాయి, ఐఈఆర్పీలు సృజన, శ్రీలత పాల్గొన్నారు.

జన్నారం: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు కళోత్సవం సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. మండల విద్యాధికారి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు జానపద నృత్యాలు, క్లాసికల్ నృత్యాలు చేసి అలరించారు. కొందరికి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులను ఎంఈవో విజయ్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రామన్న, జనార్దన్, మురళి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట మోడల్ స్కూల్లో కళోత్సవ్ పోటీలు

కాసిపేట: స్థానిక తెలంగాణ మోడల్‌స్కూల్లో మంగళవారం మండల స్థాయి కళోత్సవ్ 2023 కార్యక్రమం మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ ఆధ్వర్యంలో ప్రారంభించి ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో ఉన్న కళ, ప్రతిభను వెలికి తీసేందుకు కళోత్సవ్ పోటీలు ఉపయోగపడతాయన్నారు. మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో మండల స్థాయిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. హైస్కూల్ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో జానపద నృత్యంలో ముత్యంపల్లి పాఠశాల విద్యార్థిని ఐశ్వర్య, శాస్త్రీయ నృత్యంలో డీఏవీ దేవాపూర్ విద్యార్థిని పల్లవి, శాస్త్రీయ సంగీతంలో డీఏవీ విద్యార్థిని యశస్వీ, జానపద పాటలు మోడల్‌స్కూల్ విద్యార్థిని పావని, వాయిద్య సంగీతంలో ముత్యంపల్లి స్కూల్ వినయ్, అఖిల, చిత్రలేఖనంలో డీఏవీ పాఠశాల విద్యార్థిని ఆదిత్య కుమార్, మోడల్‌స్కూల్ అలేఖ్య, డ్రామా పోటీల్లో ముత్యంపల్లి శివకుమార్, రమ ఎంపికయ్యారు. ఈ నెల 9, 10తేదీల్లో మంచిర్యాలలో నిర్వహించే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు బండ శాంకరీ, గణేష్, మోహన్, సీసీవో రాంబాబు విద్యార్థులు పాల్గొన్నారు.

వెంటాడుతున్న కరెంట్ సమస్య..!

- నీల్వాయి ఎస్సీ కాలనీలో తరుచూ అంతరాయం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

వేమనపల్లి: ముల్కలపేట ఫీడర్ వెంట ఉన్న ఎస్సీ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌లో తరచూ సాంకేతిక సమస్య వల్ల నీల్వాయి ఎస్సీ కాలనీవాసులను కరెంట్ సమస్య వెంటాడుతోంది. ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడో పోతుందో అయోమయ పరిస్థితిలో కాలనీవాసులు గడుపుతున్నారు. గత 20 రోజుల నుంచి అంధకారంలో ఉంటున్నామని వాపోయారు. విద్యుత్ ఏఈ, స్థానిక విద్యుత్ సిబ్బందికి సమాచారమిస్తే, వారు వచ్చి సమస్య పరిష్కరించి వెళ్లిన రెండు గంటలలోపే మళ్లీ విద్యుత్‌లో అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. స్థానిక యువకులే ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ప్రమాదకరంగా ఉన్న పవర్ ఆన్ చేసుకుంటున్నారని తెలిపారు. కరెంట్ సరఫరా సరిగ్గా లేక కాలనీలో ఉన్న రేషన్ షాపు, బయోమెట్రిక్ మిషన్ చార్జింగ్ పెట్టలేక లబ్ధిదారులకు బియ్యం పంపిణీ ఇబ్బందిగా మారుతుందని డీలర్ చెన్నూరి పద్మ వాపోయారు. తాగు నీటి కష్టాలు తప్పడం లేదన్నారు. అధికారులు కాలనీలో విద్యుత్ సమస్యను పరిష్కరించకపోతే సబ్‌స్టేషన్ ముట్టడి చేయాల్సి వస్తుందని కాలనీవాసులు హెచ్చరిస్తున్నారు.